సార్వత్రిక పోలింగ్ ప్రశాంతం



వృద్ధుడిని ఓటు వేసేందుకు తీసుకొస్తున్న దృశ్యం



ఓటు వేసేందుకు వచ్చిన వృద్ధులు



రాయదుర్గం: వృద్ధురాలిని పోలింగ్ బూత్ వద్దకు తీసుకెళ్తున్న పోలీస్ కానిస్టేబుల్



గుమ్మఘట్ట మండలం గోనబావి పోలింగ్‌కేంద్రం వద్ద బారులుతీరిన ఓటర్లు



రాయదుర్గంలోని పోలింగ్ కేంద్రాల్లో ఓటు వేసేందుకు బారులుతీరిన ఓటర్లు

రాయదుర్గంటౌన్: పట్టణంలో సోమవారం సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగలేదు. ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం పోలింగ్ ముగిసే సమయం వరకు ఓటింగ్ నిర్వహించారు. మహిళలు ముఖ్యంగా వృద్ధులు, యువతీ యువకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఏ పోలింగ్ బూత్‌లో చూసినా జన జాతరను తలపించింది. కొన్ని పోలింగ్ బూత్‌ల్లో సాయంత్రం 5 గంటలకు కూడా క్యూ కనిపించింది. పట్టణంలోని బాలికోన్నత పాఠశాల, ఇందిరా గాంధీ పాఠశాల, బీజీ తిలక్ పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, అభ్యుదయ పాఠశాల పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు పెద్ద ఎత్తున హాజరై, ఓటు వేసేందుకు బారులుతీరారు. పోలింగ్‌కు ముందు రోజు వర్షం పడడంతో చల్లటి వాతావరణంలో ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

రాత్రి 10 గంటలకు ముగిసిన పోలింగ్

రాయదుర్గంటౌన్: పట్టణంలోని 32వ వార్డు డీపీఈపీ స్కూల్‌లోని పోలింగ్ బూత్ 213లో సోమవారం రాత్రి 10 గంటల వరకు పోలింగ్ జరిగింది. సదరు పోలింగ్ బూత్‌లో మొత్తం 1,375 మంది ఓటర్లకు గాను పోలింగ్ ముగిసే సమయానికి 1,207 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.

కణేకల్లులో ప్రశాంతంగా పోలింగ్

కణేకల్లు: మండలంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. వైఎస్సార్‌సీపీ, టీడీపీ కార్యకర్తల మధ్య చిన్నపాటి గొడవలు జరిగినా, కొద్దిసేపటికే సద్దుమణిగాయి. కణేకల్లులోని పోలింగ్ స్టేషన్ 133, 136లో ఎంపీ ఓటుకు సంబంధించిన ఈవీఎంలో సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో పోలింగ్ గంటపాటు ఆలస్యంగా ప్రారంభమైంది. ఉదయం 7 గంటల నుంచి 1 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ బాగా పుంజుకుంది. మాల్యం పోలింగ్ కేంద్రం 156, 154, 155లలోకి టీడీపీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులు అనుచరులను వెంటబెట్టుకొని గుంపుగా రావడంతో వైఎస్సార్‌సీపీ ఏజెంట్లు ప్రశ్నించారు. దీంతో టీడీపీ కార్యకర్తలు ఆగ్రహంతో ఊగిపోయి అభ్యర్థి వెంట వస్తే తప్పేంటి అంటూ... జై కాలవ, జైజై టీడీపీ, జైజై మోదీ అంటూ నినాదాలు చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సైతం జై జగన్...జై జై జగన్..కాబోయే సీఎం జగన్ అంటూ హోరెత్తించారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య మాటల యుద్ధం జరిగింది. కోళకుర్తిలో టీడీపీ నాయకులు ఓటర్లను మచ్చిక చేసుకునేందుకు బైక్‌లో ఎక్కించుకొచ్చి పీఎస్ వద్దకు వదిలి సైకిల్‌కు వేయమని చెబుతుండటంతో వైఎస్సార్‌సీపీ నాయకులు అభ్యంతరం తెలిపారు. ఎస్‌ఐ శ్రీనివాసులు ఘటన స్థలానికి చేరుకొని ఇరువర్గాల వారికి సర్దిచెప్పారు.

10 గంటల వరకు కొనసాగిన పోలింగ్

కణేకల్లు: మండలంలోని గోపులాపురం గ్రామంలో రాత్రి 10 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. పోలింగ్ సమయం చివరి దాకా ఓటర్లు పోలింగ్‌బూత్‌లో బారులు తీరారు. ఒకే ఒక పోలింగ్ స్టేషన్ ఉండటంతో పోలింగ్ మందకొడిగా సాగింది. 6 గంటల సమయంలో ఓటర్లు బారులు తీరడంతో ఆర్‌ఓ అప్పటికే అక్కడున్న వారికి టోకన్లు ఇచ్చి ఓటింగ్‌కు అనుమతించారు. ఈ విషయమై టీడీపీ నాయకులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఎక్కువ మంది వైఎస్సార్‌సీపీ మద్దతుదారులే ఉండటంతో జీర్ణించుకోలేక పోయిన టీడీపీ నాయకులు టోకన్ల జారీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. క్యూలో ఉన్న వారికి కూపన్లు ఇస్తే తప్పేంటనీ వైఎస్సార్‌సీపీ నాయకులు ఎదురుదాడికి దిగారు. దీంతో టీడీపీ నాయకుడు బసవరాజు వైఖరిపై వైఎస్సార్‌సీపీ నాయకులు, సర్పంచు ప్రకాష్ చౌదరి, కృష్ణారెడ్డితోపాటు పలువురు మండిపడ్డారు. పరస్పర దూషణలతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది.



కళ్యాణదుర్గం 68వ పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్న ఆర్‌ఓ రాణిసుస్మిత

కంబదూరు: మండలంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఉదయం నుంచి రాత్రి వరకు ఓటర్లు ఆయా పోలింగ్ బూత్‌లలో ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండల కేంద్రంలోని 228 పోలింగ్ బూత్‌లో గంట సేపు ఈవీఎంలు మొరాయించాయి. దీంతో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభం కావడంతో ఓటర్లు ఇబ్బంది పడ్డారు. కంబదూరులోని పలు పోలింగ్ కేంద్రాలలోని ఓటింగ్ సరళిని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్య పరిశీలించారు. మండల వ్యాప్తంగా 89 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు.

బ్రహ్మసముద్రం మండలంలో..

బ్రహ్మసముద్రం : మండలంలోని పడమటి కోడిపల్లి, బ్రహ్మసముద్రం, కన్నేలపలి, వేపులపర్తి, పోలేపల్లి తదితర గ్రామాల్లో సోమవారం పోలింగ్ సజావుగా జరిగింది. ఉదయమే ఈవీఎంలు కొద్దిసేపు మొరాయించాయి. కళ్యాణదుర్గం డీఎస్పీ బి. శ్రీనివాసులు పలు పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు.

పోలింగ్ సెంటర్లలో పోటెత్తిన జనం

కళ్యాణదుర్గం రూరల్: మండలంలో గోళ్ల, మల్లిపల్లి, గ్రామాల్లో పోలింగ్ మందకొడిగా సాగింది. సాయంత్రం 6 దాటినా పోలింగ్ సెంటర్ల వద్ద వందలాది మంది క్యూలో నిలిచి ఉన్నారు. బూత్‌లో 1000 పైగా ఓట్లు ఉడటంతో పోలింగ్ సమయం ఎక్కువ పడుతోంది.

రాత్రి వరకు కొనసాగిన పోలింగ్

కళ్యాణదుర్గం: నియోజకవర్గంలో చెదురు ముదురు సంఘటనలు మినహా సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. సాయంత్రం 6 గంటల ల్లోపు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఓటర్లకు అధికారులు ఓటు వేసే అవకాశం కల్పించారు. దీంతో పోలింగ్ శాతం మరింత పెరిగే అవకాశం ఉంది. గత ఎన్నికలతో పోల్చితే ఈ సారి పోలింగ్ శాతం ఎక్కువగా నమోదైనట్లుగా అధికారులు భావిస్తున్నారు. అధికార యంత్రాంగం ప్రతి రెండు గంటలకోసారి పోలింగ్ శాతం వెల్లడించారు. ఉదయం ఏడు గంటలకు ప్రారంభం కాగా 9 గంటలకు అప్పటి వరకు అయిన పోలింగ్ శాతాన్ని ప్రకటించారు. అనంతరం 11 గంటలకు 18.71 శాతం, 1 గంటకు 27.57 శాతం, 3 గంటలకు 52.15 శాతం, సాయంత్రం 6 గంటలకు 72.07 శాతం, రాత్రి 8 గంటలకు 78.34 శాతం, రాత్రి 9 గంటలకు 79.04 శాతం, 10 గంటలకు 83 శాతం నమోదైంది.

రాత్రి వరకు కొనసాగిన పోలింగ్ : నియోజకవర్గంలో మొత్తం 261 పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఉదయం 7 గంటలకు పోలింగ్ మొదలైంది. కొన్ని చోట్ల ఈవీఎంలు మొరాయించాయి. నియోజకవర్గంలోని బోరంపల్లి, గోళ్ల, కర్తనపర్తి, ముదిగల్లు, కై రేవు, కుర్లగుండతో పాటు పలు గ్రామాల్లో పోలింగ్ ప్రక్రియ ఆలస్యంగా ప్రారంభమైంది. నియోజకవర్గంలో ఎలాంటి అల్లర్లు, గొడవలకు తావు లేకుండా డీఎస్పీ బి.శ్రీనివాసులు పర్యవేక్షణలో పోలీసులు గట్టి బందోబస్తు చేపట్టారు.



రాయదుర్గం జెడ్పీ బాలికోన్నత పాఠశాల ఆవరణలో నిలిచిన వర్షపునీటిలో పోలింగ్ కేంద్రానికి నడిచి వెళ్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు



రాయదుర్గంలోని డ్రైవర్స్ కాలనీలోని పోలింగ్ బూత్‌లో ఓటు వేసేందుకు చిన్నారులతో వచ్చిన తల్లులు



కన్నేలపల్లిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ బి. శ్రీనివాసులు



గోళ్ల పోలింగ్ సెంటర్లో పోటెత్తిన జనం



కంబదూరులో ఓటు వేయడానికి బారులు తీరిన ఓటర్లు



ఉడేగోళంలో ఓటు వేసేందుకు క్యూకట్టిన మహిళలు



బ్రహ్మసముద్రం: బారులు తీరిన ఓటర్లు



హొసగుడ్డంలో బారులు తీరిన ఓటర్లు



రాయదుర్గంలోని ఓ పోలింగ్ కేంద్రంలో పోలింగ్ సరళిని తెలుసుకుంటున్న మెట్టు గోవిందరెడ్డి



కణేకల్లులోని 127 పోలింగ్‌స్టేషన్ వద్ద బారులు తీరిన మహిళలు



ఉద్దేహాళ్‌లో ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరిన ఓటర్లు



కొలగానహళ్లిలో ఓటు వేయడానికి క్యూ కట్టిన ఓటర్లు

క్లుప్తంగా

అయ్యగార్లపల్లిలో తెలుగు తమ్ముళ్ల ఓవరాక్షన్



అయ్యగార్లపల్లిలో ఓటర్ల మధ్య సురేంద్రబాబు అనుచరులు

శెట్టూరు: మండలంలోని అయ్యగార్లపల్లిలో ఉదయం పోలింగ్ ప్రారంభమైనప్పటి నుంచి తెలుగు తమ్ముళ్లు ఓవరాక్షన్ చేశారు. ఉదయం పోలింగ్‌బూత్‌లో టీడీపీ ఏజెంట్లు ఈవీఎంల వద్దకు వెళ్లి గుర్తులు సూచించడంతో స్థానిక నాయకులు కొందరు నిలదీశారు. అప్పటి నుంచి టీడీపీ శ్రేణులు గుంపులుగా పదే పదే పోలింగ్ కేంద్రం వద్దకు వచ్చి, గొడవలు చేస్తూ వచ్చారు. పోలింగ్ కేంద్రాల వద్దకు టీడీపీకి చెందిన స్థానికేతరులు కూడా జనంలో ఉండి స్థానికులను రెచ్చగొడుతూ వచ్చారు. వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడి చేసే ప్రయత్నం చేసినా సంయమనం పాటించారు. ఓటమి భయంతోనే టీడీపీ నాయకులు అల్లర్లు సృష్టించేందుకు యత్నించారని జెడ్పీటీసీ మంజునాథ తెలిపారు. పోలింగ్ కేంద్రం వద్ద ఓ టీడీపీ కార్యకర్త మహిళలను దుర్భాషలాడుతూ చెప్పులు చూపించడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. ఎస్‌ఐ రాంభూపాల్ ఇరువర్గాలకు సర్ది చెప్పారు.

పీఓల అత్యుత్సాహం



కైరేవు పోలింగ్ స్టేషన్‌లో గుమిగూడిన జనం

శెట్టూరు: మండలంలోని కై రేవు, కనుకూరు గ్రామాల్లోని 140, 146 పోలింగ్ బూత్‌లతో పనిచేసే ప్రిసైడింగ్ అధికారులు లక్ష్మణమూర్తి, వెంకమణి అత్యుత్సాహం ప్రదర్శించారు. ఓటర్లు, వృద్ధులకు సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని సూచించినట్లు ఓటర్లు తెలిపారు. కై రేవులో విరుపాక్షప్ప అనే వృద్ధుడు ఓటువేయడానికి బూత్‌లోకి వెళ్లాడు. ఓటువేసే సమయంలో ఆలస్యమైంది. అక్కడే ఉన్న ప్రిసైడింగ్ అధికారి లక్ష్మణమూర్తి అక్కడికి వెళ్లి ఎందుకు ఆలస్యం అని అడుగ్గా, కాస్త గందరగోళంగా అనిపించిందని చెప్పారు. దీంతో పీఓ సైకిల్ గుర్తుకు నొక్కు అని సూచించాడు. బయటికి వచ్చిన వృద్ధుడు ఇదే విషయం కుటుంబ సభ్యులకు తెలిపాడు. దీంతో వారు పీఓను నిలదీశారు.

డబ్బుతో టీడీపీ నాయకుల హల్‌చల్

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని మల్లిపల్లిలో అమిలినేని అనుచరులు ఓటమి భయంతో డబ్బుతో ఓటర్లను ప్రలోభాలకు గురి చేసిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. సోమవారం ఉదయం మల్లిపల్లి గ్రామం పోలింగ్ బూత్ 109 వద్ద పోలింగ్ ప్రారంభమై, ఓటర్లు క్యూలో ఉండగా, అమిలినేని అనుచరులు డబ్బుతో ప్రలోభాలకు గురిచేసేందుకు యత్నించారు. అయితే అదే సమయంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు అప్రమత్తం కావడంతో వారిని చూసి అమిలినేని అనుచరులు అక్కడ నుంచి పరారయ్యారు.

పోలింగ్ బూత్‌లను పరిశీలించిన తలారి రంగయ్య



శెట్టూరులోని పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న అభ్యర్థి తలారి రంగయ్య

శెట్టూరు: మండలంలోని ఎన్నికల సరళిని వైఎస్సార్‌సీపీ అభ్యర్థి తలారి రంగయ్య పరిశీలించారు. శెట్టూరు, అయ్యగార్లపల్లి, పెరుగుపాళ్యం, ములకలేడు, తిప్పనపల్లి, కంబాలపల్లి గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. కైరేవు, కనుకూరు గ్రామాలలో పోలింగ్ బూత్‌లలోని అధికారులు సైకిల్‌గుర్తుకు ఓటు వేయాలని సూచించినట్లు వచ్చిన ఆరోపణలపై వివరాలు తెలుసుకున్నారు.

ఈవీఎంలు మొరాయింపు బారులు తీరిన ఓటర్లు

బొమ్మనహాళ్: సార్వత్రిక ఎన్నికలకు పోలింగ్ సోమవారం కొనసాగింది. ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్లు బారులు తీరారు. యువకులు,మహిళలు, వృద్ధులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. బొమ్మనహాళ్ మండలంలోని పలు పోలింగ్ బూత్‌లో ఈవీఎంలు మొరాయించడం, విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడడం, పలు చోట్ల పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. ఉంతకల్లు, శ్రీధరఘట్ట, దేవగిరి తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం, ఈవీఎంలు మొరాయించారు. దర్గాహొన్నూరు 100 పోలింగ్ బూత్‌ల్లో కొందరు మహిళలు అక్కడ నేలపై కూర్చొని ఉన్నారు. ఈవీఎంల సర్వర్ల ప్రారంభంతో ఓటింగ్ ప్రక్రియ నెమ్మదిగా సాగిందన్నారు.

బొమ్మనహాళ్: మండలంలోని దర్గాహొన్నూరు, సింగానహళ్లి, కురువల్లి, సిద్ధరాంపురం తదితర గ్రామాల్లో రాత్రి 9 గంటలపై వరకు ఎన్నికల పోలింగ్ కొనసాగింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుండా ఎస్‌ఐ శ్రీనివాసులు భద్రతా చర్యలు తీసుకున్నారు.

ఓటెత్తారు!

● స్వల్ప ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతం

రాయదుర్గం: రాయదుర్గం నియోజకవర్గంలో ఓటరు చైతన్యం వెల్లువిరిసింది. ఉదయం 7 గంటల నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద జనం బారులు దీరారు. సాయంత్రం 5 గంటలకు పోలింగ్ సమయం ముగిసినా, చాలా కేంద్రాల్లో బారులుదీరి కనిపించడంతో రాత్రి 9 గంటల వరకు పోలింగ్ కొనసాగించారు. కొన్ని ప్రాంతాల్లో ఈవీఎంలు మొరాయించగా, మరికొన్ని ప్రాంతాల్లో చెదురుమదురు ఘటనలు జరిగాయి. డీ హీరేహాళ్ మండలం పాత హడగలిలో రెండు గంటలపాటు పోలింగ్ ఆగింది. అధికారులు మాక్‌పోలింగ్‌ను కంటిన్యూ చేయడంతో సమస్య ఉత్పన్నమైంది. దాన్ని క్లియర్ చేయకుండానే సాధారణ పోలింగ్ ప్రక్రియ చేపట్టారు. 103 ఓట్లు పోలైతే 153కు ఈవీఎం లెక్క చూపింది. ఈ నేపథ్యంలో కాసేపు తర్జనభర్జన పడ్డారు. ఉన్నతాధికారుల సూచన మేరకు మొత్తం పోల్‌లో కౌంటింగ్ రోజు 50 ఓట్లు తొలగించేలా ఇరుపార్టీలకు చెందిన ఏజెంట్ల మధ్య ఒప్పందం చేసుకున్నట్టు తెలిసింది. కల్యంలోనూ ఈవీఎం మొరాయించడంతో గంటపాటు పోలింగ్ ఆగింది. కణేకల్లు మండలం ఆదిగానపల్లి, రచ్చుమర్రి బూత్‌లోనూ ఈవీఎం మొరాయించడంతో పోలింగ్ కాసేపు ఆగింది. బొమ్మనహాళ్ మండలం దేవగిరి, రాయదుర్గం మండలం ఆర్డీవంక లోనూ కాసేపు ఈవీఎం లు సతాయించాయి. గుమ్మఘట్ట మండలం సిరిగేదొడ్డి పోలింగ్ బూత్ వద్ద ఓ అధికారి టీడీపీకి ఓటేయమని చెప్పినట్టు తీవ్ర చర్చసాగింది. మారెంపల్లి, కలుగోడు పోలింగ్ బూతుల్లోనే టీడీపీ నాయకులు మకాం వేసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులపై ఓ పోలీస్ అధికారి తరచూ ఆవేశంతో ఊగిపోవడం విమర్శలకు తావిచ్చింది. టీడీపీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులు ఓవరాక్షన్ చేశారు. కణేకల్లు మండలం 155, 156 పోలింగ్ బూత్‌లను టీడీపీ నాయకులతో కలిసి సందర్శించారు. కాంపౌండ్ లోపలికెళ్లకా జై కాలువ, జైమోదీ అంటూ వెంటతీసుకెళ్లిన కార్యకర్తలు నినాదాలు చేయడం రచ్చకు దారి తీసింది. కాలవ తీరుకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ నాయకులు కూడా అక్కడికి చేరి నినాదాలు చేశారు. దీంతో కాసేపు ఉద్రిక్తత నెలకొంది. పోలీసుల రంగ ప్రవేశంతో వివాదం సద్దుమణిగింది.

పోలింగ్ సరళిని పరిశీలించిన మెట్టు : పట్టణంలోని పలు పోలింగ్ బూత్‌లను వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి పరిశీలించారు. రూరల్ ప్రాంతాల్లోని మిగిలిన అన్ని మండలాల్లోనూ పోలింగ్ బూత్‌లను తనయులు మెట్టు విశ్వనాథ్‌రెడ్డి, మెట్టు కుశాల్‌రెడ్డి సందర్శించారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు నాయకులు, కార్యకర్తలను ఉత్తేజపరిచారు.

గెలుపుపై మెట్టు ధీమా : ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధిస్తుందని ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఏ గ్రామానికెళ్లినా 'ఫ్యాన్' ప్రభంజనం సృష్టించిందని ఆయన చెప్పారు. జూన్ 4న రాయదుర్గం కోటపై వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం కోతిగుట్టలోని డ్రైవర్స్ కాలనీలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో అభ్యర్థి మెట్టు, సతీమణి యశోదమ్మ, పెద్ద కుమారుడు ఎంజీ అమర్‌నాథ్, అతడి సతీమణి, మెట్టు విశ్వ సతీమణి మెట్టు శాంభవితో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు.

పోలింగ్ అధికారా?.. 'పచ్చ' కార్యకర్తా



కన్నేపల్లిల్లో పోలింగ్ కేంద్రం వద్ద ప్రహరీ ఎక్కి ఓటర్లను ఇబ్బంది పెడుతున్న టీడీపీ కార్యకర్తలు



పోలింగ్ అధికారిని నిలదీస్తున్న ఓటర్లు

బ్రహ్మసముద్రం : మండల కేంద్రంలోని పోలింగ్ బూత్ నెంబర్ 27లో ఎలక్షన్ ఆఫీసర్‌గా వచ్చిన బీవీ రామయ్య ఓటు వేయడానికి వచ్చిన ఓటర్లకు సైకిల్ గుర్తుకే ఓటు వేయాలని,సైకిల్ గుర్తుకు ఎదురుగా బటన్ నొక్కండి అని సూచించాడు. పదే పదే అదే విధంగా ఓటర్లకు చెప్పడంతో విసిగి పోయిన పోలింగ్ ఏజెంట్లు , ఓటర్లు సైతం అతన్ని నిలదీశారు. పోలింగ్ అధికారివా? లేక పచ్చ కార్యకర్తవా అని గట్టిగా ప్రశ్నించారు. దీంతో తాను అనుకుంటే ఇంతటితో ఈ బూత్ క్లోజ్ చేయగలను అని బెదిరించడంతో ఓటర్లు , పోలింగ్ ఏజెంట్లు వాదనకు దిగారు. ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. సోమవారం సాయంత్రం కన్నేపల్లి, నంజాపురం తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల వద్దకు టీడీపీ అభ్యర్థి అమిలినేని అనుచరులు గ్రూపులుగా వచ్చి అలజడి సృష్టించారు. ఓటర్లను ప్రలోభాలు పెట్టుందుకు ప్రయత్నించారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడి



ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న నాగభూషణ



గాయపడిన ఆంజనేయులు

కుందుర్పి: మండలంలోని కెంచంపల్లిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ కార్యకర్తలు రాళ్లతో దాడి చేశారు. సోమవారం ఎన్నికల పోలింగ్ సందర్భంగా పోలింగ్ కేంద్రంలో జరిగిన చిన్నపాటి ఘర్షణ భౌతిక దాడులు చేసుకునే స్థాయికి చేరింది. గ్రామానికి చెందిన నాగభూషణం, ఆంజినేయులు అనే వ్యక్తులను టీడీపీ కార్యకర్తలు ధనరాజు, ప్రతాప్, రమేష్, వీరేష్, రాజేశ్, లింగరాజు, హరీష్, కె.నాగేంద్ర, వెంకయ్యానాయుడులతో పాటు మరికొంతమంది చితకబాదారు. టీడీపీ కార్యకర్తలు రాయితో బలంగా విసరడంతో నాగభూషణ గొంతుకు బలమైన గాయమైంది. దాడిలో ఆంజనేయులు అనే మరో వైఎస్సార్‌సీపీ కార్యకర్త గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని అతన్ని కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు.

ఓటు వేయకుండా 20 మందిని వెనక్కి పంపిన అధికారులు

గుమ్మఘట్ట: మండల వ్యాప్తంగా ఉన్న 45 పోలింగ్ కేంద్రాల్లో సోమవారం ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. బీటీపీ, సిరిగెదొడ్డి, గొల్లపల్లి ,పూలకుంట గ్రామాల్లో పోలింగ్ మందకొడిగా సాగింది. చెదురుమొదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మండల వ్యాప్తంగా 39,809 మంది ఓటర్లు ఉండగా, 35,248 మంది తమఓటు హక్కును వినియోగించుకున్నారు. 88.54 శాతం ఓట్లు పోలయ్యాయి. గత ఎన్నికల్లో కన్నా ఈ సారి పోలింగ్ శాతం పెరిగింది. ఓటు వేసేందుకు ఓటర్లు ఉదయం నుంచే బారులు తీరారు. వైద్యంగుండ్లపల్లి గ్రామంలో అత్యధికంగా 96.23 శాతం ఓట్లు పోలింగ్ కాగా, గోనబావి 275 పోలింగ్ కేంద్రంలో అత్యల్పంగా 81.28 శాతం ఓట్లు పోలైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. కాగా సిరిగెదొడ్డిలో 20 మంది ఓటర్లను ఓటు వేయకుండా ఎన్నికల అధికారులు వెనక్కి పంపడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి ఇంటిపై రాళ్లతో దాడి

గుమ్మఘట్ట: మండలంలోని భూపసముద్రానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పూసల రుద్రప్ప ఇంటిపై రాళ్లతో సోమవారం దాడి చేశాడు.ఇంట్లో ఎవరూలేని సమయంలో ఇళ్లపై దాడి చేసి, ఆస్తులు ధ్వంసం చేశారని పూసల రుద్రప్ప, మరదలు బుట్టమ్మ తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదన్నారు.